సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



ప్రచార యావ.. ప్రమాదాలకు తోవ

కూటమి నేతల ప్రచార యావ ప్రమాదాలకు తోవగా మారింది. ఎలాంటి అనుమతులు లేకున్నా ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో సమస్య తలెత్తింది. -8లో



పోలీస్‌స్టేషన్‌లోనే.. దోచేశాడు

ఖాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఓ ఇంటి దొంగ చేతివాటం ప్రదర్శించాడు. దొంగల నుంచి రికవరీ చేసి.. లాకప్‌లో ఉంచిన కాపర్ వైరును ఓ కానిస్టేబుల్ చోరీ చేశాడు. -8లో



వాతావరణం

జిల్లాలో గురువారం 15.4 – 35.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు దామోదరం సంజీవయ్య జయంతి

కడప సెవెన్‌రోడ్స్: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శుక్రవారం కడప కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

భద్రతా నియమాలతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్: రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నగర శివారులోని ఊటుకూరులో గల జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం డిల్లీశ్వరరావు, కడప ట్రాఫిక్ సీఐ జావెద్, ఎంవీఐ విజయ్ భాస్కర్, ప్రసాద్, ఏఎంవీఐ లక్ష్మీప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితుల స్థల పరిశీలన



నిర్వాసితుల స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం టీటీడీలో విలీనం అయ్యి, రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు మొదలు పెట్టినప్పటి నుంచి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం నచ్చక కొన్నేళ్లుగా స్థలాన్ని ఇచ్చేందుకు నిరాకరిస్తున్న నిర్వాసితుల స్థలాన్ని గురువారం కడప జాయింట్ కలెక్టర్ అధితి సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రామాలయ పరిసరాల్లో పెండింగ్‌లో 1500/బీ1 సర్వే నంబర్లు గల నిర్వాసితుల స్థలం వద్దకు స్థానిక మండల రెవెన్యూ అధికారి తహసీల్దార్ రమణమ్మ, ఆర్డీఓ జాన్ ఇర్విన్‌తో కలిసి వెళ్లి పరిశీలించారు. ఆ స్థలానికి సంబంధించి సర్వే నంబరు, విస్తీర్ణతను స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


లక్ష్యం.. దూరం

- మందకొడిగా మార్కెటింగ్ కమిటీల పన్ను వసూళ్లు
- 2024–25 ఏడాది లక్ష్యం రూ.1250 లక్షలు
- ఫిబ్రవరి 12 నాటికి వసూలు రూ. 953.86 లక్షలు
- మార్చి చివరి వరకు గడువు




కడప మార్కెట్ యార్డులో విక్రయానికి సిద్ధంగా ఉన్న పసుపు దిగుబడి

కడప అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా మార్కెట్ కమిటీల సెస్సు(పన్ను) వసూళ్లు కొంత మందకొడిగా సాగుతున్నాయి. జిల్లాలో ఉన్న మార్కెట్ కమిటీలకు సంబంధించి 2024–25 ఏడాదికి రూ.1250 లక్షల వసూలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. అయితే ఫిబ్రవరి 12వ తేదీ నాటికి రూ.953.86 లక్షలు వసూలు చేశారు. ఇంకా ఈ ఏడాది లక్ష్యానికి 296.14 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మార్కెట్ కమిటీలకు సంబంధించిన సెస్సు వసూళ్లకు కేవలం 45 రోజుల గడువు ఉంది. అంటే ఈ లెక్కన రోజుకు అన్ని మార్కెట్ కమిటీలు కలిసి రూ.6.5 లక్షలు వసూలు చేస్తే కానీ.. మార్చి చివరి నాటికి లక్ష్యం పూర్తి అవదు. మరి రోజూ అన్ని మార్కెట్ కమిటీలు కలిసి రూ. 6.5 లక్షలు వసూలు చేయడం సాధ్యమయ్యే పనేనా లేదా అనేది వేచి చూడాల్సిందే.



మార్కెట్ కమిటీలు: జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, కమలాపురం, ఎల్ఆర్‌పల్లె, సిద్దవటం, ఎర్రగుంట్లలో మార్కెటింగ్ కమిటీలు ఉన్నాయి. ఇందులో కడప మార్కెట్ కమిటీలో పసుపు, వేరుశనగలు.. మిగతా మార్కెట్ కమిటీల్లో పండ్లు, ఇతర ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

21 చెక్ పోస్టులు



జిల్లాలో పది మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో 21 చెక్‌పోస్టులు ఉన్నాయి. ఇందులో కడప మార్కెట్ కమిటీలో పసుపు, వేరుశనగ వంటి క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. మిగతా 9 మార్కెట్ కమిటీలలో పలు రకాల ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతాయి. పులివెందుల మార్కెట్ కమిటీ నుంచి బత్తాయి, అరటి, నిమ్మ వంటివి ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. వీటి పరిధిలో ఎక్కువ మంది ట్రేడర్లు ముందు సెస్సు చెల్లించి ఎగుమతులు చేస్తుంటారు. మరి కొంతమంది చిన్న స్థాయి వ్యాపారులు చెక్ పోస్టుల వద్ద చెల్లించి ఎగుమతులు చేస్తుంటారు. రైతుల శ్రేయస్సుకు సంబంధించి పలు రకాల కార్యక్రమాలు చేపడతారు. ఈ ఉత్పత్తుల ధరతో ఒక శాతం సెస్సుగా వసూలు చేయగా, వరిధాన్యంపై 2 శాతం సెస్‌ను వసూలు చేస్తున్నారు.

బద్వేలు ముందంజ

జిల్లాలో పది మార్కెట్ కమిటీ ఉన్నాయి. ఇందులో సెస్ వసూళ్లలో బద్వేలు ముందంజలో ఉంది. బద్వేల్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.180 లక్షలు ఉండగా, ఫిబ్రవరి 12వ తేదీ నాటికి రూ.173.77 లక్షలు వసూలు చేసి 96.54 శాతానికి చేరుకుని జిల్లాలో మొదటి స్థానం సాధించింది. ఎర్రగుంట్ల మార్కెట్ కమిటీ లక్ష్యం 75 లక్షలు కాగా 60.62 లక్షలు వసూలు చేసి 80.83 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. సిద్దవటం లక్ష్యం రూ.26 లక్షలు ఉండగా, 20.8 లక్షలు వసూలు చేసి 77.23 శాతంతో మూడో స్థానంలో ఉంది. సింహాద్రిపురం మార్కెట్ కమిటీ జిలాల్లో వెనుకబడింది. సింహాద్రిపురం మార్కెట్‌యార్డు లక్ష్యం రూ.20 లక్షలు కాగా 13.19 లక్షలు వసూలు చేసి 65.95 శాతంతో చివరి స్థానంలో నిలిచింది.

వసూలైన సెస్ వివరాలు

మార్కెట్ కమిటీ	లక్ష్యం (రూ.లక్షల్లో)	వసూలు (రూ.లక్షల్లో)
కడప	185	129.79
సింహాద్రిపురం	20	13.19
ప్రొద్దుటూరు	182	131.40
బద్వేలు	180	173.77
జమ్మలమడుగు	120	84.66
పులివెందుల	102	75.80
మైదుకూరు	270	195.35
కమలాపురం	90	69.20
సిద్దవటం	26	20.08
ఎర్రగుంట్ల	75	60.62
మొత్తం	1250	953.86



కడప మార్కెట్ యార్డు

చర్యలు తీసుకుంటున్నాం



జిల్లాలో 2024–25 ఏడాదికి 10 మార్కెట్ కమిటీలతోపాటు 21 చెక్‌పోస్టులు ఉన్నాయి. ఆయా మార్కెట్ కమిటీలతోపాటు చెక్‌పోస్టుల ద్వారా వార్షిక ఆదాయం రూ. 1250 లక్షలు వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టింది. ఏదిఏమైనా మార్చి చివరి నాటికి లక్ష్యాన్ని చేరుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– అజాద్‌వల్లి, మార్కెటింగ్ శాఖ ఏడీ

నేడు వైఎస్ జగన్ రాక



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం జిల్లాకు రానున్నారు. 14వ తేదీ ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని ఆయన నివాసం నుంచి బయలుదేరి 9.05కు తాడేపల్లిలోని హెలీప్యాడ్ చేరుకుంటారు. 9.10కి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.40కి కడప విమానాశ్రయానికి వస్తారు. 10.50కు ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి 11 గంటలకు స్థానిక మద్రాసు రోడ్డులోని మేడా రఘునాథరెడ్డి కన్వెన్షన్ హాలుకు చేరుకుంటారు. అక్కడ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. 11.15కి అక్కడి నుంచి బయలుదేరి 11.25కి తిరిగి కడప ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. 11.30కి కడప విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.30కి బెంగళూరులోని జక్కూరు ఎరోడ్రోమ్ చేరుకుని, అటు నుంచి యలహంకలోని తన నివాసానికి వెళ్లనున్నారు.

నూతన కార్యవర్గం

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా కౌలు రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా అధ్యక్షులుగా ఎస్.శంకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై.వి.సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా గోశెట్టి రామ్మూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షులుగా టి.మనోహర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎస్.సుబ్బారెడ్డి, సి.కిరణ్‌కుమార్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులుగా సుంకేసుల మహానందరెడ్డి, గొంది సురేష్ యాదవ్, ఎం.మునిరెడ్డి, జిల్లా కోశాధికారిగా ఎం.జయంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 22, 23, 24 తేదీలలో కడప నగరంలో జరిగే ప్రాంతీయ మహాసభల విజయవంతానికి కృషి చేస్తామని వారు తెలియజేశారు.

శేష వాహనంపై రంగనాథుడు

పులివెందుల టౌన్: స్థానిక పూలంగళ్ల వద్ద శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో ఘనంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. మూడవ రోజైన గురువారం రాత్రి శ్రీరంగనాథస్వామి సతీ సమేతుడై శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

ఉదయం ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య సంఘ సభ్యులచే విశేష పూజలు జరిపించారు. రాత్రి శేషవాహనంపై పట్టణ పురవీధులైన పూలంగళ్ల సర్కిల్, కచేరి రోడ్డు, ముత్యాలవారివీధి, గాడిచర్లవీధి, అమ్మవారి శాలమీదుగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దగ్గరుండి పర్యవేక్షించారు. రాత్రి తిరునాల ప్రాంగణంలో యువరాజా కళానిలయం చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



శేషవాహనంపై శ్రీరంగనాథస్వామి ఊరేగింపు

రంజాన్ మాసం.. పుణ్యదాయకం

- మాసంలోని ప్రతి క్షణాన్ని పుణ్యసాధనకు కృషి చేయాలి
- ప్రతి ఒక్కరూ దైవ మార్గాన్ని అనుసరించాలి
- భక్తిశ్రద్ధలతో షబ్–యే–బరాత్‌పర్వదినం
- ప్రార్థనతో కళకళలాడిన మసీదులు

కడప కల్చరల్: రంజాన్ ప్రాధాన్యతను గుర్తిస్తూ ప్రతి ఒక్కరూ మాసంలోని ప్రతి క్షణాన్ని పుణ్యసాధనకు కృషి చేయాలని పలువురు ముస్లిం మత గురువులు, ఆధ్యాత్మిక వేత్తలు పిలుపునిచ్చారు. ముస్లిం సమాజం గురువారం షబ్–యే–బరాత్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంది. జిల్లాలోని అన్నిప్రాంతాలతోపాటు జిల్లా కేంద్రమైన కడప నగరంలోని దాదాపు అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిళలు, పిల్లలు తమ ఇళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి నమాజ్ ప్రార్థనలు, జికర్‌లో పాల్గొన్నారు. మసీదులు భక్తుల ప్రార్థనలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు తెల్లవారుజాము ఫజర్ నమాజ్ వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా మత గురువులు, ఆధ్యాత్మికవేత్తలు భక్తులనుద్దేశించి మాట్లాడారు. ముఖ్యంగా షబ్బే బరాత్ పర్వదినం విశిష్టతను తెలియజేశారు. రంజాన్ మాసం పొందడం తమ అదృష్టంగా భావించాలన్నారు. ఈ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తూ నిరంతరం ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారన్నారు. ఈ మాసంలోని ప్రతి క్షణాన్ని పుణ్యసాధనకు కృషి చేయాలన్నారు. అల్లాహ్‌తోపాటు మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) జీవన విధానాన్ని కొనసాగించాలని భక్తులకు సూచించారు. అనంతరం ప్రత్యేక నమాజులు, జికర్, తహజుద్ నమాజ్‌లు పాటిస్తూ తమతోపాటు తమ కుటుంబ సభ్యులు పాపాలను క్షమించాలని, స్వర్గలోక ప్రాప్తి కల్పించాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. ఇదిలా ఉండగా మసీదులకు అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో.. వారికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా మసీదు కమిటీ ప్రతినిధులు విశేష ఏర్పాట్లు చేశారు. మసీదులకు ఏర్పాటు చేసిన విద్యుద్దీప అలంకరణ పర్వదిన శోభను మరింత రెట్టింపు చేసింది.



విద్యుత్‌దీప కాంతుల్లో బహదూర్ ఖాన్ మసీదు

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీధర్

బద్వేలు అర్బన్: రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తహసీల్దార్లను హెచ్చరించారు. గురువారం బద్వేలు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎస్‌హెచ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 3778 ఫిర్యాదులు అందగా 1131 ఫిర్యాదులకు మాత్రమే పరిష్కారం చూపడం జరిగిందని, అలాగే రీసర్వే గ్రామసభల్లో కూడా ఇప్పటికీ చాలా ఫిర్యాదులకు పరిష్కారాలు అందలేదని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా మండలాల్లో నెలకొన్న భూ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలి

బి.కోడూరు: రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి, అధిక లాభాలు పొందాలని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దుళ్ళపల్లె కొండ ప్రాంతంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన రాక్‌ఫిల్డ్ చెక్‌డ్యాం, వాటర్‌షెడ్ చెక్‌డ్యాంలను ఆయన పరిశీలించారు. అనంతరం పెద్దుళ్ళపల్లె గ్రామాన్ని పరిశీలించి దేవాలయం వద్ద గ్రామానికి సంబంధించిన అవసరాలు, సమస్యలపై గ్రామస్తులు, రైతులతో చర్చించారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, తహసీల్దారు మధునాయక్, వాటర్‌షెడ్, రెవెన్యూ, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

బార్‌లపై ఎక్సైజ్ అధికారుల దాడులు

- జిల్లా నడిబొడ్డులో లైసెన్స్ లేకుండా నిర్వహణ
- ఎస్‌టీఎఫ్ అధికారుల దాడులతో బట్టబయలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: విజయవాడ నుంచి వచ్చిన ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులతో.. బార్‌లలో జరుగుతున్న అవినీతి తేటతెల్లమైంది. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో విజయవాడ నుంచి వచ్చిన స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుబాబు పర్యవేక్షణలో సీఐ నరసింహులు ఆధ్వర్యంలో సిబ్బంది మారువేశంలో కమలాపురం లోని పునీత్ బార్‌కు వచ్చి మద్యం బాటిళ్లు కొన్నారు. బార్‌లో కూర్చొని మద్యం తాగే వారికే విక్రయించాలనే నిబంధనలున్నాయి. అయితే నిబంధనలకు విరుద్ధంగా పునీత్ బార్ యాజమాన్యం మద్యం విక్రయాలు జరుపుతున్నారని ప్రత్యక్షంగా తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బార్‌ను మూసివేశారు. బార్‌లో పని చేసే ఇద్దరు సిబ్బందిని ఎర్రగుంట్ల ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే అధికార పార్టీ నాయకులు కేసు నమోదు చేయకుండా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కాగా విజయవాడ నుంచి వచ్చిన అధికారులు బార్ సిబ్బందిపై కేసు నమోదు చేస్తారా? లేక అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి కేసు నమోదు చేయకుండా వదిలేస్తారా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అలాగే పునీత్ బార్‌లో విక్రయిస్తున్న మద్యం కూడా సమీప గ్రామంలోని మద్యం షాపునకు చెందినదిగా అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.



లైసెన్స్ లేకుండానే నిర్వహణ

జిల్లా కేంద్రమైన కడప నగరంలోని ఓ ప్రజా ప్రతినిధికి చెందిన బార్‌కు సంబంధించిన లైసెన్స్ 4 నెలల క్రితమే ముగిసింది. అయితే ఇంత వరకు రెన్యువల్ చేసుకోలేదు. ఈ నాలుగు నెలల కాలంలో ఆ బార్ పేరిట ఒక్క పర్మిట్ కూడా వేయలేదంటే.. అధికార యంత్రాంగం నిద్ర మత్తులో జోగుతోందా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎక్సైజ్ డీసీ, ఏసీ, ఈఎస్‌లు విధులు నిర్వహించే జిల్లా కేంద్రంలోనే.. ఇలా లైసెన్స్ లేకుండా బార్ నిర్వహిస్తున్నారంటే అధికారుల పనితీరు అధికార పార్టీ నాయకులకు జీహుజూర్ అనే రీతిలో ఉందని తెలుస్తోంది. శుక్రవారం ఎస్‌టీఎఫ్ అధికారులు దాడులు నిర్వహిస్తారనే సమాచారం రావడంతో.. ఆ బార్ మూసివేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే విధంగా ఎక్సైజ్ సిబ్బంది ప్రవర్తించాలని పలువురు కోరుతున్నారు.

ఎక్సైజ్ సీఐపై విచారణ

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఓ ఎక్సైజ్ సీఐపై ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్ మధుబాబు సీఐ నరసింహులు ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఓ ప్రధాన గెస్ట్‌హౌస్‌లో విచారణ చేపట్టారు. గతంలో కడపలో ఎక్సైజ్ సీఐగా పని చేసిన సమయంలో కొందరి వ్యక్తుల నుంచి డబ్బులను అప్పుగా తీసుకొని ఇవ్వకపోవడంతో.. బాధితులు విజయవాడలో పై స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా ఆ ఎక్సైజ్ సీఐపై విచారణ నిర్వహించారు. ప్రస్తుతం ఆ సీఐ విజయవాడ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్నట్లు సమాచారం.

విద్యార్థులు ఆదర్శంగా నిలవాలి

ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్: విద్యార్థులు సమాజంలో ఆదర్శంగా నిలవాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని పోలీసు సిబ్బందికి, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు, పోలీసు కుటుంబాల చిన్నారులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి గురువారం కడపలోని 'పెన్నార్' పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ నగదు బహుమతులు అందజేశారు. పోలీసు సిబ్బందికి 'ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు', పోలీసు కుటుంబాల చిన్నారులు, స్కూల్ విద్యార్థులకు 'సైబర్ నేరాల నిరోధంలో యువత పాత్ర' అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరులతోపాటు సమాజంలో పోలీసుల విధులు, త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరుల స్మారకోత్సవాలను జరుపుకొంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు ఆనంద్, టైటస్, వీరేష్, శ్రీశైలరెడ్డి, డీపీఓ ఏఓ జ్యోతి, సూపరింటెండెంట్ శ్రీనివాసనాయక్, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులను అందుకున్న వారితో ఎస్పీ అశోక్‌కుమార్, పోలీసు అధికారులు

'ఉపాధి'పై టీడీపీ పెత్తనం



నరసాపురంలో సామాజిక ప్రజావేదికలో అధికారుల పక్కన కూర్చున్న టీడీపీ నాయకుడు

- బహిరంగ సభలో వేదికపై కూర్చున్న నేతలు
- కూటమి ఒత్తిడికి తలొగ్గిన అధికారులు
- నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు
- ముగ్గురితో బలవంతపు రాజీనామా

కాశినాయన: టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కాశినాయన మండలంలో గురువారం చోటుచేసుకున్న సంఘటనే ఇందుకు నిదర్శనం. ఎలాంటి ప్రొటోకాల్ లేకున్నా.. ఉపాధి హామీ పనుల బహిరంగ సభలో అధికారుల పక్కన కూర్చొని పెత్తనం చెలాయించారు. దీనికి అధికారులు కూడా తల ఊపడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

- మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లోకి వెళ్లి ప్రతి ఇంటిని సందర్శించి నివేదికలు తయారు చేశారు. గురువారం నరసాపురంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఓపెన్ ఫోరమ్ నిర్వహించారు. ఈ సమావేశం డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మొత్తం రూ.9.96 కోట్లతో 1005 పనులు చేపట్టారు. ఇందులో రూ.2.75 లక్షల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం తేల్చింది.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యం

టీడీపీ నాయకులు ఎటువంటి ప్రొటోకాల్ లేకున్నా అధికారుల పక్కన సామాజిక వేదికలో కూర్చున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో చిన్న తప్పులు సాకుగా చూపించి ఆకులనారాయణపల్లె, వరికుంట్ల, నరసాపురం, ఇటుగుల్లపాడు ఫీల్డ్ అసిస్టెంట్లను అప్పటికప్పుడే తొలగించారు. రంపాడు, కత్తెరగండ్ల, గొంటువారిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్లను బెదిరించి బలవంతంగా రాజీనామా చేయించారు. డ్వామా అధికారులు కూడా టీడీపీ నాయకుల మాటలకు వత్తాసు పలికారు. గతంలో జరిగిన ఓపెన్ ఫోరమ్‌లకు భిన్నంగా కూటమి నాయకులు పాల్గొనడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు అనుకూలంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండు నెలల నుంచే ఎంపీడీఓ ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్లను రాజీనామా చేయించాలని కూటమి నాయకులు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. సమావేశంలో డీపీఓ రామలింగారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ డీఈ విజయభాస్కర్, బద్వేలు ఏపీడీ ఆనంద్, ఎంపీడీఓ మైథిలి, ఉపాధి సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా సమితి రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న కోటపాటి సుబ్బమ్మ

కడప ఎడ్యుకేషన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభలలో మహిళలకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాలని, పురుషులతోపాటు సమానంగా మహిళలకు అగ్రపీఠం వేయాలని అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కోటపాటి సుబ్బమ్మ, పీఎస్ఆర్ఎస్ ప్రవల్లిక తెలిపారు. రాష్ట్ర మహాసభలలో భాగంగా కడప ఓంశాంతి నగర్‌లో ఉన్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయం నందు రెండో రోజున సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అఖిల భారత అగ్రగామి మహిళా సమితి ముందుండి పోరాటం కొనసాగిస్తుందన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని వారు పేర్కొన్నారు. అనంతరం అగ్రగామి మహిళా సమితి నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని మహిళలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కోటపాటి సుబ్బమ్మ (రాజంపేట), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పీఎస్ఆర్ఎస్. ప్రవల్లిక, ఉపాధ్యక్షులు గా పి.మహాలక్ష్మి (అనంతపూర్), ధనలక్ష్మిరెడ్డి (నెల్లూరు), కార్యదర్శులుగా సత్యవతీదేవి (విజయనగరం), జక్కుల పుష్ప (రాజమండ్రి), పద్మప్రియ (కర్నూలు), అరుణ కుమారి (కడప)లతో పాటు 32 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దమ్ముంటే అవినీతిని నిరూపించండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నగర మేయర్ కె.సురేష్ బాబులు అవినీతి చేసి ఉంటే నిరూపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి.జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, త్యాగరాజు, షఫీ సవాల్ విసిరారు. మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ 2014–19 మధ్య కాలంలో కడప నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెచ్చారో టీడీపీ నాయకులు చెప్పాలన్నారు. నీరు–చెట్టు పథకం ద్వారా కోట్ల రూపాయలు దోచుకోలేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఒక్క రూపాయి నిధులైనా తెచ్చారా అంటూ టీడీపీ నాయకులను నిలదీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిచేసిన పనులను ఇపుడు ప్రారంభిస్తున్నారని, మంజూరైన నిధులకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పనులను ప్రారంభించడానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డికి ఏం అర్హత ఉందని ప్రశ్నించారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ శ్రీనివాసులురెడ్డి అని ధ్వజమెత్తారు. మదనపల్లెలో ఫైల్స్ కాల్చిన కేసులో ఉన్న అధికారిని ఇక్కడికి కమిషనర్‌గా తెచ్చుకొని...ఇష్టానుసారంగా రాజ్యమేలుతున్నారని మండిపడ్డారు. కోట్ల విలువ జేసే ప్రభుత్వ స్థలాన్ని టీడీపీ కార్యాలయానికి తీసుకోవడాన్ని ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రభుత్వం ద్వారా ఏ నిధులు తెచ్చి టెంకాయలు కొడుతున్నారో ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలస్వామిరెడ్డి, కె.బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఐస్‌క్రీం రవి, రామ్మోహన్‌రెడ్డి, కిరణ్, కంచుపాటి బాబు పాల్గొన్నారు.

ప్రచార యావ ... ప్రమాదాలకు తోవ


మైదుకూరురోడ్డులో సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు


సిద్దవటంరోడ్డులో రోడ్డుకు అడ్డంగా పడిన ఫ్లెక్సీ

కూటమి నేతల ప్రచార యావ ప్రమాదాలకు తోవగా మారింది. ఎలాంటి అనుమతులు లేకున్నా పట్టణంలో ఎక్కడబడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తున్నారు. ప్రధాన రహదారులు, డివైడర్ల మధ్యలో సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో అవి విరిగిపడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.


ఈ చిత్రంలో గాయాలతో కనిపిస్తున్న వ్యక్తి పేరు పోకల మల్లేశ్వర్‌రెడ్డి. బద్వేల్ మండలం మల్లంపేట గ్రామానికి చెందిన ఈయన ఓ పని నిమిత్తం పట్టణానికి వస్తున్న క్రమంలో సిద్దవటం రోడ్డులోని ఎన్‌జీవోకాలనీ సమీపంలో డివైడర్ల మధ్యలో సెంట్రల్ లైటింగ్ స్తంభానికి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ మీద పడటంతో గాయాలపాలయ్యాడు. ఘటన జరిగిన సమయంలో వెనుకవైపు నుండి భారీ వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

- పట్టణంలో అడ్డగోలుగా ఫ్లెక్సీల ఏర్పాటు
- సర్కిళ్ళు, డివైడర్లను వదలని వైనం
- ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న కూటమి నేతలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

బద్వేలు అర్బన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కడబడితే అక్కడ ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. చిన్నాచితక కార్యక్రమాలు, కూటమి నేతల పుట్టినరోజు వేడుకలు... ఇలా ప్రతి కార్యక్రమానికి విపరీతమైన ప్రచారంతో మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండానే ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తున్నారు. ముఖ్యంగా పట్టణంలోని మైదుకూరు రోడ్డు, నాలుగు రోడ్ల కూడలి, సిద్దవటం రోడ్డు, బైపాస్ రోడ్డు ఇలా అనేక చోట్ల ఫ్లెక్సీలు వెలిశాయి. చివరకు జాతీయ రహదారి–67లోని మైదుకూరు రోడ్డు, నెల్లూరురోడ్డులలోని డివైడర్లలోనూ ఫ్లెక్సీలు వెలిశాయి. పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రభుత్వ హయాంలో కుడా నిధులతో డివైడర్లను సుందరంగా తీర్చిదిద్దారు. అయితే కూటమి నేతలు అడ్డగోలుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అనుమతులు లేకుండానే ఏర్పాటు

పట్టణ పరిధిలో ప్రచార నిమిత్తం బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా పురపాలక పట్టణ ప్రణాళిక విభాగం నుండి అనుమతులు తీసుకోవడంతోపాటు నిర్దేశించిన రుసుము చలానా రూపంలో చెల్లించాలి. అంతేకాకుండా జాతీయ రహదారిపై డివైడర్ల మధ్య ఎట్టిపరిస్థితుల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదనే నిబంధనలున్నాయి. అయితే ఇవేమీ పట్టని కూటమి నేతలు పురపాలక పట్టణ ప్రణాళిక విభాగం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఎక్కడబడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది. దీంతో పట్టణ ప్రణాళిక విభాగానికి ఆదాయం సైతం తగ్గిపోతోంది.

ప్రమాదాలకు తోవ

పట్టణ పరిధిలో జాతీయ రహదారి– 67లో భాగమైన మైదుకూరురోడ్డు, నెల్లూరురోడ్డులో డివైడర్ల మధ్య సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు కొన్ని నెలలుగా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ప్రధాన రహదారుల్లో ఫ్లెక్సీలు ఉండడంతో వాహన చోదకులు ఫ్లెక్సీలను గమనిస్తూ డ్రైవింగ్‌పై ఏకాగ్రత కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. ఈ సమయంలో భారీ వాహనాలు వెళ్లే సందర్భంలో డివైడర్ల మధ్యలో ఉన్న ఫ్లెక్సీలకు వాహనాలు తగిలి కొన్ని చోట్ల స్తంభాలు సైతం ఒరిగిపోయాయి. అంతేగాక గాలులు వీచినప్పుడు ఫ్లెక్సీలు రోడ్డుకు అడ్డంగా పడిపోవడం, వాహన దారులపై పడడం వంటి సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. అంతేగాక ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించక ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ఇదే అంశంపై 32వ వార్డు కౌన్సిలర్ బండిచెన్నయ్య పలుమార్లు పురపాలక సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేసినప్పటికీ మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రమాదాలకు అడ్డాగా మారిన ఫ్లెక్సీలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పురప్రజలు కోరుతున్నారు.

నోటీసులు అందజేశాం

పట్టణంలో ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంపై పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సతీష్‌ను వివరణ కోరగా పట్టణంలోని డివైడర్లపై, ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు ఎటువంటి అనుమతులు లేవు. ఆ మేరకు ఇప్పటికే సంబంధిత ప్రకటనదారులకు నోటీసులు అందజేశాం. వీలైనంత త్వరగా అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

సతీష్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి

మూడేళ్ల తర్వాత భార్య చెంతకు


నరసింహారావును భార్యకు అప్పగించిన ఎస్‌ఐ

పోరుమామిళ్ల : ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త మూడేళ్ల తర్వాత కనిపించడంతో భార్య సంతోషం వ్యక్తం చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని చిదానందనగర్‌కు చెందిన జూటూరి నరసింహారావు(53) 2022 ఏప్రిల్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయారు. భార్య లక్ష్మీదేవి అప్పట్లో భర్త కొరకు వెతికి, ఎక్కడా కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంతకాలం అతని ఆచూకీ లభించలేదు. ఇటీవల నరసింహారావు గుంటూరులో ఉన్నట్లు తెలుసుకొని అతన్ని గురువారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వ్యక్తిగత కారణాలతో భార్యాబిడ్డలను వదిలి గుంటూరు పోయిన నరసింహారావు అక్కడ కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నాడు. అతని గురించిన సమాచారం తెలియడంతో ఎస్‌ఐ కొండారెడ్డి గురువారం తెచ్చి భార్య లక్ష్మీదేవికి అప్పగించారు.

యువతి అదృశ్యం

బి.కొత్తకోట : తల్లిదండ్రులు కుమార్తె పెళ్లికోసం పెళ్లి చూపులు ఏర్పాటు చేసిన రోజే అదృశ్యమైన ఘటన అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని బాటవారకురవపల్లిలో జరిగింది. దీనిపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్పనాయక్ గురువారం తెలిపారు. వివరాలు.. బాటవారకురవపల్లికి చెందిన జి.సురేంద్ర కుటుంబం జిల్లాలోని రైల్వేకోడూరులో స్థిరపడింది. అక్కడ పానీపూరి బండి నడుపుకొంటూ జీవిస్తున్నారు. వీరి కుమార్తె జి.శిల్ప (20) తిరుపతిలో ఫిజిషియన్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతోంది. శిల్పకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించి వాయల్పాడుకు చెందిన యువకుడితో పెళ్లిచూపుల ఏర్పాటుకు నిర్ణయించారు. దీంతో గ్రామానికి చేరుకుంది. బుధవారం ఇంట్లో పెళ్లి చూపులకు సన్నాహాలు చేసుకుంటుండగా మాయమైంది. కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చక్రస్నానం.. సర్వపాపహరణం


స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీచక్ర స్నానం ఆచరిస్తున్న ఆలయ అర్చకులు

పులివెందుల టౌన్ : పులివెందుల నడి బొడ్డున వెలసిన వేంకటరమణుడి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. చివరిఘట్టమైన చక్రస్నానం గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలోని కొలనులో చక్రస్నానం ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో స్వామి ని పంచామృతంతో అభిషేకించి.. తులసీమాల, సుగంధ వట్టి వేరు మాలలతో అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గోవిందా..గోవిందా అంటూ దేవదేవుడిని వేడుకుని మహా మంగళహారతులు పట్టారు. ఆలయంలో ఏర్పాటుచేసిన కొలనులో చక్రస్నానం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు కొలనులో మునిగితేలారు. చక్రస్నానం నిర్వహించేటప్పుడు స్నానమాచరిస్తే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఊంజల సేవ చేపట్టి ఉభయదారులతో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామికి తిరుప్పావడి(అన్నంతో స్వామివారి ప్రతిమ)నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం యాగశాలలో కలశారాధన ప్రధాన నిత్య హోమాలు, విశేష హోమాలు చేసి పూర్ణాహుతి చేపట్టారు. ధ్వజా అవరోహణ చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

నేడు ఏకాంత సేవ

వేంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయంలోని అద్దాల మండపంలో ఏకాంతసేవ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు తెలిపారు. స్వామి ఏకాంత సేవలో భక్తులు పాల్గొని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అగ్ని ప్రమాదంలో గుడిసెలు దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : అగ్ని ప్రమాదంలో రెండు గుడిసెలు గురువారం దగ్ధమయ్యాయి. మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన సింగినాదం శ్రీనివాసులు చేనేత కుటుంబ సభ్యులతో కలిసి పొలం పనులకు వెళ్లారు. అనంతరం వారి నివాసం నుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకునే లోపే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. ఈ మంటల్లో బాధితుడి చేనేత మగ్గాలు, నూలు, ఇంట్లో దుస్తులు, నగదు, వంట సామగ్రి కాలిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు శ్రీనివాసులు ఇంటిపక్కన కంపచెట్లకు నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలు ఎగసిపడి బోద కొట్టాలు కాలినట్లు భావిస్తున్నారు. సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఖాజీపేట : భూమయపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అరుణ (53) అనే మహిళ మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. గూడపురెడ్డి అరుణ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఖాజీపేట మండలం భూమాయపల్లె గ్రామానికి చెందిన తన తమ్ముడు వెంకట ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వివాహం శుక్ర, శనివారాల్లో జరగనుంది. తమ్ముడి వివాహం కోసం గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి భూమాయపల్లె జాతీయ రహదారి వద్ద దిగారు. రోడ్డు దాటుతుండగా మైదుకూరు నుంచి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. అక్కడికక్కడే ఆమె మృతిచెందారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న వారు సల్లబసాయపల్లెకు చెందిన గజ్జల రవిశంకర్‌రెడ్డి, నరశింములుగా పోలీసులు గుర్తించారు. వారు కడప రిమ్స్‌కు వెళ్తున్నట్లు తెలిసింది. ప్రమాదంలో నరసింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం మృత దేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

బైక్‌పై నుంచి పడి...

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కొర్రపాడు రోడ్డులోని పాలిటెక్నిక్ కాలేజీ ఎదురుగా షేక్ తన్వీర్ (15) అనే బాలుడు బైక్‌పై నుంచి ప్రమాదశాత్తూ కింద పడి మృతి చెందాడు. అమృతానగర్‌కు చెందిన ఖాదర్ బాషా ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి కుమారుడు తన్వీర్ పండ్ల దుకాణంలో పనిచేస్తున్నాడు. దుకాణ యజమాని ఇంటి నుంచి క్యారీ తీసుకుని రమ్మని చెప్పడంతో అతను బైక్ తీసుకుని భగత్ సింగ్ కాలనీకి బయల్దేరాడు. పాలిటెక్నిక్ కాలేజీ వద్దకు వెళ్లగానే అదే సమయంలో ఇద్దరు విద్యార్థులు సైకిల్‌లో రోడ్డు దాటసాగారు. వారిని తప్పించే క్రమంలో తన్వీర్ బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. తీవ్రగాయాలైన బాలుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ దేవ కిరణ్ తెలిపారు.

జ్యూస్ బండి ఢీకొని..

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగేంద్ర (47) అనే వ్యక్తి మృతి చెందాడు.పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బలపనూరు గ్రామానికి చెందిన నాగేంద్ర వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి జేసీబీ ఉంది.జేసీబీకి సామాన్ల కోసం పులివెందులకు ద్విచక్రవాహనంలో వచ్చాడు. తిరిగి బలపనూరుకు వెళ్తుతుండగా పులివెందుల నుంచి జయమ్మ కాలనీకి వెళ్తున్న మార్వాడీల జ్యూస్ బండి ఢీకొంది. దీంతో నాగేంద్ర తలకు బలమైన గాయమైంది. చెవులు, ముక్కులో నుంచి రక్తం రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేంద్ర కు భార్య నాగసులోచన, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ హాజీవలి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మైనర్ బాలుడు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తల్లి మందలించిందనే మనస్తాపంతో మైనర్ బాలుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్త ఇండ్లకు చెందిన మైనర్ బాలుడు(13) ఏడో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లకుండా చిల్లర తిరుగుళ్లు తిరుగుతుండటంతో బడికి ఎందుకు వెళ్లలేదని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన రాజా సాయిప్రదీప్ ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పోలీస్ స్టేషన్‌లోనే.. దోచేశాడు

- కాపర్ వైర్ దోచేసిన దొంగ
- చోరీ చేసిన వారిపై సీఐ విచారణ
- సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక
- తదుపరి చర్యలకు సిఫార్స్

ఖాజీపేట : దొంగల నుంచి రక్షించాల్సిన కానిస్టేబుళ్లగల పోలీస్ స్టేషన్‌లోనే.. దొంగతనం జరగడం చర్చనీయాంశమైంది. ఇది చేసింది ఓ కానిస్టేబుల్ అని తెలియడంతో అందరూ ముక్కున వేసేసుకునే పరిస్థితి. చోరీ చేసిన దొంగల నుంచి రికవరీ చేసిన కాపర్ వైర్‌ను ఓ కానిస్టేబుల్ చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులు అంతర్గతంగా విచారణ జరిపి తగిన చర్యలకు సిఫార్స్ చేశారు. వివరాల్లోకి వెలితే ఖాజీపేట మండలంలో 2024 రెండు ట్రాన్స్‌ఫార్మర్ లను దొంగలు పగుల కొట్టి అందులోని కాపర్ వైర్‌ను చోరీ చేశారు. దానికి సంభందించి పోలీసులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు (53,85 క్రైం నంబర్) పోలీసులు కేసు నమోదు చేశారు.

దొంగల నుంచి రికవరీ

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల విషయమై పోలీసులు ప్రత్యేక దర్యాప్తు నిర్వహించారు. ఈ దర్యాప్తులో దొంగలను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. చోరీ చేసినట్లు నిర్ధారణ కావడంతో తరువాత వారి నుంచి సుమారు 14 కిలో కాపర్ వైర్ ను రికవరీ చేశారు. అలా రికవరీ చేసిన కాపర్‌వైర్‌ను ఖాజీపేట పోలీస్ స్టేషన్ లాకప్‌లో ఉంచారు. అయితే రికవరీ కాపర్ వైర్‌ను తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు పెట్టేందుకు పోలీసులు ప్రయత్నించగా లాకప్‌లో కాపర్ వైర్ కనిపించకపోవడంతో పోలీసులు తీవ్ర ఆందోళన చెందారు.

కాపర్ వైర్ మాయంపై విచారణ

లాకప్‌లోని కాపర్ వైర్ మాయం అవడంపై ఖాజీపేట సీఐ మోహన్ తీవ్రంగా పరిగణించారు. దీనిపై పోలీసులదరినీ ప్రత్యేకంగా విచారించారు. ఎవ్వరూ చెప్పకపోవడంతో స్టేషన్‌లోని సీసీ కెమెరాలను నిపుణులతో కలిసి పరిశీలించారు. అందులో కాపర్ వైర్‌ను డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటను సీఐ ఆ కానిస్టేబుల్‌ను విచారించి అతను దాచి ఉంచిన కాపర్ వైర్‌ను రికవరీ చేసి తిరిగి క్రైంలో చూపించారు.

ఉన్నతాధికారులకు నివేదిక

జరిగిన ఈ సంఘటన పై ఖాజీపేట సీఐ మోహన్ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. చోరీకి పాల్పడిన కానిస్టేబుల్ పై చర్యలు తీసుకోవాలని సిఫార్స్ చేశారు. ఇప్పటికే కానిస్టేబుల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసి అతన్ని ఖాజీపేట స్టేషన్ విధుల నుంచి తప్పించినట్లు సమాచారం. అయితే చిన్న సమస్యలు జరిగితే కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించే పోలీసులు స్టేషన్‌లోనే చోరీ చేసిన సంఘటన పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని స్థానికుల్లో చర్చ నడుస్తోంది.

చర్యలు తీసుకుంటాం

స్టేషన్‌లో కాపర్ వైర్ చోరీపై పోలీసుల అంతర్గత విచారణ జరుగుతోంది. దీనికి సంబంధించి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. తదుపరి చర్యలకు సిఫార్స్ చేశాం.

- మోహన్, ఖాజీపేట

ఎంకాం లేటరల్ ఎంట్రీకి అనుమతి ఇవ్వాలి

వైవీయూ వీసీ, రిజిస్ట్రార్ల వైఖరిపై ఆగ్రహం


ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప ఆర్ట్స్ కళాశాలలో ఎంకాం లేటరల్ ఎంట్రీకి అనుమతులివ్వాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయనన మాట్లాడుతూ ఆయన మాట్లాడారు. నూతన విద్యా విధానంలో భాగంగా మూడేళ్ల డిగ్రీని నాలుగేళ్లకు పెంచి.. అదే కళాశాలలో ఎంఏ ఆనర్స్ ఐదో సంవత్సరానికి అనుమతి లేదని యూనివర్శిటీ అధికారులు చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. అధ్యాపకులున్నా, తరగతి గదులున్నా యూనివర్శిటీ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఈ విషయంలో వైవీయూ వీసీ.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పద్మ వైఖరి విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందన్నారు. విద్యార్థులను ఎక్కడా డబ్బు పేరుతో ఇబ్బందులకు గురిచేయకుండా వారికి సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఓవైపు చెబుతున్నప్పటికీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్, నాయకులు ఎల్.చంద్ర, బి.అరుణ్ నాగార్జున, సాయి, మధు, సాయిరాం, హరిప్రసాద్, నరసింహ పాల్గొన్నారు.

మా పరిధిలో లేని అంశం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఎంకామ్ లేటరల్ ఎంట్రీ తమ పరిధిలో లేదని యోగి వేమన విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పుత్తా పద్మ స్పష్టం చేశారు. విషయం తెలుసుకోకుండా అనవసరంగా విద్యార్థి సంఘాలు రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొన్నారు. పీజీ కోర్సులకు అనుమతి ఇవ్వాల్సింది ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి అని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి పోర్టల్ ద్వారా అప్లై చేసుకోవాలని, వసతులు పరిశీలించి రిపోర్టు ఇచ్చాక అనుమతులు వస్తాయన్నారు.

ఆచార్య వంగల సునీతకు రెండు పేటెంట్లు


ఆచార్య వంగల సునీతకు పేటెంట్ పత్రం ఇచ్చి అభినందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం భూగర్భ శాస్త్రం విభాగపు హెడ్ ఆచార్య వంగల సునీతకు రెండు పేటెంట్లు లభించాయి. కృత్రిమ మేధ ఆధారిత మురుగు నీటి శుద్ధి పరికరం, లెడ్ టాక్సిసిటీ డిటెక్షన్ అండ్ క్లీనింగ్ మెషిన్ ఆవిష్కరణలకు యునైటెడ్ కింగ్‌డమ్ పేటెంట్లు లభించాయి. కృత్రిమ మేధ ఆధారిత మురుగు నీటి శుద్ధి పరికరంతో వ్యర్థ జలాల్లో కలుషితం పరిమితులను అంచనా వేసి దానికి తగ్గట్లుగా యంత్రం పనితీరును ఆప్టిమైజ్ చేయవచ్చు. తద్వారా సమయం, ఖర్చు ఆదా చేసి ఇంధన ఖర్చు తగ్గించి పర్యావరణ పరిరక్షణకు పనిచేస్తుంది. లెడ్ టాక్సిసిటీ డిటెక్షన్ అండ్ క్లీనింగ్ మెషిన్ లీడ్ టాక్సిసిటీ పరిమితిని డిటెక్ట్ చేసి దాని స్థాయిలను తగ్గిస్తుంది. ఈ బృందంలో ఆచార్య సునీతతో పాటు ఇతర సభ్యులు బాలాజీ ఇటికల, బండి మురళీధరరెడ్డి, జి. శ్రావ్య సాయి, మన్నల ప్రసాద్ ఇంకా వై. సుదర్శన రెడ్డి ఉన్నారు. పేటెంట్ రావటంతో వైవీయూ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథరెడ్డి, రఘుబాబు, జయరాజు, శ్రీనివాస గౌడ్, ఇంకా పీఆర్ సెల్ డైరెక్టర్ డా.పి సరిత హర్షం వ్యక్తం చేశారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం: స్థానిక పెన్నానగర్‌లో మట్కా నిర్వహిస్తున్న షేక్ సాధిక్‌వలి, అతని భార్య షేక్ షాకిరాబానులను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 36 వేల నగదు, 1600 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. దంపతులైన సాధక్‌వలి, షాకిరాబానులు కొంత కాలంగా మట్కా నిర్వహిస్తున్నారు. మట్కాతో పాటు గంజాయి విక్రయిస్తే మంచి ఆదాయం వస్తుందని భావించిన వారు గుర్తు తెలియని వ్యక్తి నుంచి పది రోజుల క్రితం గంజాయి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ఇరువురు మట్కా నిర్వహిస్తూ గంజాయిని అమ్ముతున్నారు. జమ్మలమడుగు బైపాస్‌రోడ్డులోని బ్రహ్మం గుడి వద్ద సాధక్‌వలి, షాకిరాబాను గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. దాడిలో ఇరువురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మట్కా స్లిప్పులతో పాటు గంజాయి, నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

తొక్కాలని చూసినా..మీ గుండెల నుంచి నన్ను వేరు చేయలేరు

మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో మంచు మనోజ్ వ్యాఖ్య


మాట్లాడుతున్న సినీ హీరో మంచు మనోజ్

రాయచోటి : నాకు జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా.. ఎంత మంది తొక్కాలని చూసినా.. బురద చల్లాలని చూసినా.. మీ గుండెల నుంచి మాత్రం నన్ను వేరు చేయలేరని సినీ హీరో మంచు మనోజ్ కామెంట్ చేశారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జగన్నాథ్ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌కు హీరో మనోజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆ నాలుగు గోడల మధ్యకు రానీవకపోయినా.. నన్ను ఏం చేసినా.. ప్రజల గుండెల్లో నుంచి నన్ను తీయలేరని నేను గట్టిగా నమ్ముతానన్నారు. మీరే నా దేవుళ్లు, మీరే నా కుటుంబం.. మీరే నాకు అన్నీ అంటూ అభిమానుల కేరింతల మధ్య మాట్లాడారు. చెట్టు పేరు, జాతి పేరు చెప్పుకొని మార్కెట్లో అమ్ముడుపోవడానికి నేను కాయో.. పండునో కాదన్నారు. నన్ను తొక్కాలన్నా.. లేపాలన్నా అభిమానుల వల్లే అవుతుంది... ఈ ప్రపంచంలో ఎవడి వల్లా కాదన్నారు.. ఓ కాజ్ కోసం నిలబడినప్పుడు.. న్యాయం జరిగే వరకు వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.